## కొనుగోలు కేంద్రానికి భారీగా జొన్నలు



జొన్న పంటతో తరలివచ్చిన వాహనాలు

ఇంద్రవెల్లి, మే 25 : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం వివిధ గ్రామాలకు చెందిన రైతులు జొన్న పంటతో భారీ ఎత్తున తరలివచ్చారు. 800 క్వింటళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు పీఏసీఎస్ సీఈవో ధరింసింగ్ పేర్కొన్నారు. ఒకేసారి జొన్నలతో భారీగా తరలిరావడంతో కొనుగోలు కేంద్రం రైతులు, జొన్నల బస్తాలతో నిండింది. దీంతో రైతులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు. జొన్నలతో ఉన్న వాహనాలు గంటల తరబడి క్యూ కట్టాయి.

## నిప్పుల కుంపటి

### నిర్మల్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 45.6 డిగ్రీలు



నిర్మానుష్యంగా మారిన రహదారి

నిర్మల్ అర్బన్, మే 25 : నిర్మల్ జిల్లా నిప్పుల కుంపటిలా మారింది. మొన్నటి వరకు ఈదురుగాలులు, చిరుజల్లులతో వాతావరణం చల్లబడగా.. శనివారం ఉష్ణోగ్రతలు మళ్లీ ఒక్కసారిగా పెరిగినట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో అత్యధికంగా నిర్మల్ జిల్లాలోని కుభీర్ మండలంలో 45.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

## అమ్మ ఆదర్శ స్కీం ద్వారా సౌకర్యాలు మెరుగుపర్చాలి

ఉట్నూర్, మే 25 : ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలకు అమ్మ ఆదర్శ స్కీం పథకం ద్వారా సౌకర్యాలు మెరుగుపర్చాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం స్థాని క కుమ్రం భీం ప్రాంగణంలో ఉమ్మడి జిల్లాలోని డీటీడీవోలు, ఏటీడీవోలు, ఏసీఎంవో లు, జీసీడీవోలు, ఎస్ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ.. పాఠశాలల పునఃప్రారంభం నాటి కి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. ఆశ్రమ పాఠశాలలోని అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్ బిల్లులను మంజూరు చేస్తామని తెలిపారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల లోటు లేకుండా చూడాలన్నారు. ప్రతి ఎస్ఈఆర్పీ, డీఈతో కలిసి సమస్యలు లేకుండా చూడాల ని, సెప్టిక్ ట్యాంక్లు లీకేజీలు లేకుండా చూ డాలని ఆదేశించారు. కొలాం, తోటి, కొలవా ర్ ఆదిమ గిరిజన విద్యార్థులను హైదరాబాద్ హయత్నగర్లో ప్రతిభ గురుకుల కళాశాలలో చేర్పించేందుకు అవగాహన కల్పించాలన్నారు. కొత్తగా పదో తరగతిలో చేరిన విద్యార్థులకు ఇంగ్లిష్, గణితంలో రాటుదేలేలా చర్య లు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీడీ దిలీప్, ఈఈ భీంరావు, డీటీడీవోలు రమాదేవి, గంగారాం పాల్గొన్నారు.

## యువకుడి మృతి

### హార్వెస్టర్ అతని మీద పడడంతో ప్రమాదం



దర్శనం కనకయ్య(ఫైల్)

నర్సాపూర్(జి), మే 25 : మండల కేంద్రానికి చెందిన దర్శనం కనకయ్య(42) తనకున్న ట్రాక్టర్ను హార్వెస్టర్ మాదిరిగా మార్చాడు. యాసంగి సీజన్లో పంటలను కోయడానికి అద్దెకు వెళ్లేవాడు. ఈ క్రమంలో కోతలు అయిపోవడంతో ట్రాక్టర్ను సాధారణంగా వాడుకోవడానికి హార్వెస్టర్ నుంచి ట్రాక్టర్ను వేరు చేస్తున్నారు. శనివారం సాయంత్రం హార్వెస్టర్ కింద ఆయన ఉండి జాకీలు పెట్టి ట్రాక్టర్ను వేరు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు జాకీలు పక్కకు తొలగడంతో ట్రాక్టర్తో కూడిన హార్వెస్టర్ అతనిపై పడింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో జేసీబీని తెప్పించి ఆయనను బయటకు తీశారు. నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి చనిపోయాడని నిర్ధారించారు. కనకయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. అతని భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ హన్మాండ్లు తెలిపారు.

# నకిలీ విత్తనాలపై నిఘా

- టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటు
- విత్తన దుకాణాలు, గ్రామాల్లో విస్తృత తనిఖీలు
- జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో హెల్ప్‌లైన్ నంబర్లు

**80748 12429, 93927 79149**



ఆదిలాబాద్, మే 25(నమస్తే తెలంగాణ) : వానకాలంలో నకిలీ విత్తనాల విక్రయాలను నిరోధించడానికి అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. మరో పక్షం రోజుల్లో సీజన్ ప్రారంభకానుండడంతో రైతులు తమ భూములను సిద్ధం చేసుకుని విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది 5.60 లక్షల ఎకరాల్లో పంటలు వేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అధికంగా పత్తి 4.16 లక్షల ఎకరాల్లో పండించే అవకాశాలున్నట్లు గుర్తించారు. రైతులు ఇప్పటికే పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. పత్తిని సాగుచేసే రైతులు వివిధ కంపెనీలకు చెందిన బీటీ-2 విత్తనాలను ఉపయోగిస్తారు. జిల్లాలో 245 విత్తన డీలర్ల వద్ద 5.88 లక్షల పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటించారు.



ఇంద్రవెల్లిలో విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య

రైతులు తమకు అవసరమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నారు. అధికారులు 55 కంపెనీల బీటీ-2 విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అంటున్నా రైతులకు అవసరమైన పత్తి విత్తనాల కొరత ఉంది. తాము అడుగుతున్న ఓ కంపెనీకి చెందిన విత్తనాల స్టాక్ లేదని దుకాణాదారులు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటు

రైతుల అవసరాలను ఆసరా చేసుకుని కొందరు వ్యాపారులు, దళారులు నకిలీ విత్తనాల విక్రయానికి పాల్పడుతున్నారు. వివిధ కంపెనీల బీటీ-2 పత్తి విత్తనాల పేరిట నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారు. రెండు రోజుల కిందట ఆదిలాబాద్‌లోని రాంనగర్ ప్రాంతంలో నకిలీ విత్తనాల తయారీ కేంద్రంపై పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు దాడి చేసి నాసిరకం విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారులు, దళారులు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ లాంటి రాష్ట్రాల నుంచి విత్తనాలను తీసుకొచ్చి విక్రయించిన ఘటనలు వెలుగు చూశాయి. నాసిరకం విత్తనాల విక్రయాల నిరోధానికి అధికారులు చర్యలు చేపట్టారు. పోలీసు, వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో కూడిన టాస్క్‌పోర్స్ కమిటీలు ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి కమిటీల్లో డీఎస్పీ, ఆర్డీవో, ఏడీఏ, మండల స్థాయి కమిటీల్లో తహసీల్దార్, మండల వ్యవసాయశాఖ అధికారి, సీఐ సభ్యులుగా ఉంటారు. వీరు దుకాణాలను క్రమంగా తనిఖీలు నిర్వహిస్తారు. రైతులకు విత్తనాల కొనుగోళ్లు, లభ్యత, ఎంపిక, ఇతర సలహాలు, సూచనల కోసం జిల్లా వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతులు 8074812429, 9392779149 నంబర్లకు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య తెలిపారు.



ట్రిపుల్ ఐటీ ఉన్నతాధికారులతో వీసీ క్షేత్ర పర్యటన

## ముందస్తు చర్యలు తీసుకోండి..

### బాసర ఆర్‌జీయూకేటీ వైస్ చాన్సలర్ వెంకటరమణ

బాసర, మే 25 : ట్రిపుల్ ఐటీ పునః ప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యార్థులకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌జీయూకేటీ వైస్ చాన్సలర్ వెంకటరమణ అన్నారు. శనివారం ఆర్‌జీయూకేటీ అభివృద్ధి పనులపై సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. జూన్ 5వ తేదీన కళాశాల పునః ప్రారంభం అవుతున్న దృష్ట్యా వసతి గృహాలు, తరగతి గదులలో సమస్యలు లేకుండా చూడాలని, నీరు, విద్యుత్, ఇతర సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జీయూకేటీ స్పెషల్ ఆఫీసర్, నిర్మల్ జిల్లా వివిధ శాఖల అధికారులు, బాసర మండలాధికారులు పాల్గొన్నారు. అలాగే గత సంవత్సరం విశ్వవిద్యాలయం సజావుగా పని చేయడానికి తమ పూర్తి సహకారాన్ని అందించినందుకు కలెక్టర్, ఇతర అధికారులందరికీ వీసీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉన్నతాధికారులతో కలిసి విశ్వవిద్యాలయంలోని క్షేత్ర పర్యటన చేశారు.

## వినియోగదారుల ఫోరం కార్యాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న మీనా రామనాథన్

ఎదులాపురం, మే 25 : జిల్లా వినియోగదారుల ఫోరం కార్యాలయాన్ని రాష్ట్ర వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు మీనా రామనాథన్ శనివారం తనిఖీ చేశారు. సహాయ రిజిస్ట్రార్లు తిరుమల్ రావు, భాస్కర్‌రావు, రాంప్రసాద్‌లతో కలిసి కేసుల పరిష్కారం తీరు, పెండింగ్ కేసుల తీరు పరిశీలించడంతోపాటు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఆమె వెంట జిల్లా వినియోగదారుల ఫోరం చైర్మన్ శామ్యూల్, సభ్యురాలు మాధవి ఉన్నారు.


